క్లుప్తంగా

ఎంజేపీలో కల్చరల్ ఫెస్ట్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామ మహాత్మ జ్యోతిబాపూలే(ఎంజేపీ) బాలుర పాఠశాలలో మంగళవారం కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్సీవో గోపిచంద్, డీసీవో సంతోశ్, ఎస్వో నందమోహన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

17న మున్సిపల్ గదులకు వేలం

ఖానాపూర్: పట్టణ పరిధిలోని 26 మున్సిపల్ అద్దె గదులకు ఈనెల 17న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 15న రూ.లక్ష చొప్పున డీడీ తీసీ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'నిరుద్యోగుల తరఫున పోరాడుతాం'



టీసేవ్ లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో నిరుద్యోగుల తరఫున పోరాటం చేస్తామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ లోకిని రాము అన్నారు. మంగళవా రం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో పా ర్టీ ఆధ్వర్యంలో రూపొందించిన టీసేవ్ లోగో ను ఆవిష్కరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు పా న గంటి నరేష్, యూత్ మండల అధ్యక్షుడు మహేశ్, మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు ఇమ్రాన్, తదితరులు ఉన్నారు.

పనులు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో జరుగుతున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం ప్రజాఆరోగ్యశాఖ ఈఈ గంగాధర్ పరిశీలించారు. నాణ్యత, ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తిచేయాలని కోరారు. వారి వెంట డీఈ సంతోశ్, ఏఈ తిరుపతి ఉన్నారు.

'బలగం' ప్రదర్శన

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం గ్రామంలో మంగళవారం బలగం చిత్రం ప్రదర్శించారు. గ్రామానికే చెందిన ఎండపెల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సినిమా వీక్షించిన గ్రామస్తులు తమ వాళ్లను గుర్తుకు తెచ్చుకొని కంటతడి పెట్టారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

లక్ష్మణచాంద: గ్రామాల స్వచ్ఛత అందరి బాధ్యత అని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. వీధుల్లో పర్యటిస్తూ రోడ్లు శుభ్రంగా ఉండటంతో సిబ్బందిని అభినందించారు. మిగతా గ్రామాలు పొట్టపెల్లి(కే)ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: బలగం

వారసంత.. సమస్యలే అంత

- స్థలం సరిపోక రోడ్డుపై అమ్మకాలు
- ఆదాయమున్నా.. కానరాని సౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



స్థలం సరిపోక రోడ్డుపై అమ్మకాలు



సంతలో షెడ్లు లేకపోవడంతో గొడుగుల కింద విక్రయిస్తున్న చిరువ్యాపారులు

తానూరు: మండల కేంద్రమైన తానూరులో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో చిరువ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో అధికారులు సంతకు కేటాయించిన ప్రత్యేక స్థలం సరిపోక కొందరు వ్యాపారులు రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. పన్నులు వసూలు చేస్తున్నా.. వారసంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు. ఈ సంతకు మండలంతోపాటు మహారాష్ట్రలోని భోకర్, ధర్మాబాద్, ఉమ్రి వంటి గ్రామాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి వ్యాపారం కొనసాగిస్తుంటారు.

రోడ్డుపైనే వ్యాపారం..

వారసంత నిర్వహణకు కేటాయించిన స్థలం సరిపోకపోవడంతో కొందరు చిరువ్యాపారులు ఖర్కెల్లి, జౌలా, మొగిలి, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లే రోడ్లపైనే సంత నిర్వహిస్తున్నారు. దీంతో ప్రతి మంగళవారం ఈ మార్గంలో వచ్చిపోయే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే సంత ఏర్పాటు చేయడంతో దుమ్ము, ధూళి పడిన తినుబండారాలు తిని రోగాల బారిన పడుతున్నామని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు

సంతలో తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి చిరువ్యాపారుల కోసం షెడ్లను నిర్మించాలి దూర ప్రాంతాల నుంచి వచ్చే చిరువ్యాపారుల వాహనాల కోసం స్థలం కేటాయించాలి.

ఆదాయం ఉన్నా..

ప్రతిఏటా వారసంత కోసం పంచాయతీ అధికారులు వేలం నిర్వహిస్తారు. గతేడాది సంతకు వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం రూ.2.26 లక్షలు సమకూరింది. ఈసంవత్సరం(2023–2024)కు సంబంధించి ఇటీవల వేలం నిర్వహించగా రూ.2.50లక్షలు పంచాయతీకి ఆదాయంగా సమకూరింది. వేలం దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు.. చిరువ్యాపారుల నుంచి ప్రతి వారం కొంత వసూలు చేస్తారు. వచ్చిన సొమ్ముతో సంతలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు.

డీపీవో ఆదేశించినా మారని తీరు

గతేడాది డీపీవో శ్రీలత తానూరు పంచాయతీని సందర్శించి సంతలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కాని ఇప్పటివరకు అధికారులు మాత్రం సంతలో సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వారసంతలో ఇబ్బంది కలగ్గకుండా సౌకర్యాలు కల్పించాలని చిరువ్యాపారులతోపాటు ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



తానూరు వారసంత ద్వారా ఆ దాయం వస్తున్నా అధికారులు మాత్రం సౌకర్యాలు ఏ ర్పా టు చేయడం లేదు. దీంతో వ్యా పారం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. తాగడానికి నీళ్ల లేవు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

– అబ్దుల్ హాషీం, వ్యాపారి, ముధోల్

ఇబ్బంది లేకుండా చూస్తాం

తానూరు వారసంతలో ఉన్న సమస్యలను సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. చిరు వ్యాపారుల కోసం తాగునీటి వసతి, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పిస్తాం. సంతకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తాం.

– జాదవ్ జాలంసింగ్, పంచాయతీ కార్యదర్శి

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

- సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు



మున్సిపల్ అత్యవసర సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, చైర్మన్, సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అంకం రాజేందర్ అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు ఎజెండా అంశాలపై సభ్యులు చర్చించారు. అనంతరం చైర్మన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన మున్సిపాలిటీ కావడంతో ఆదాయానికి మించి ఖర్చు ఉందని.. ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు పన్నులను సకాలంలో వసూలు చేయించాలని కలెక్టర్ తెలిపారని పేర్కొన్నారు. ఎజెండాలో లేనప్పటికీ సభ్యుల కోరిక మేరకు శ్రీరాంనగర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.ఐదు లక్షలు కేటాయించాలని నిర్ణయించామన్నారు. ఇకపై ఖానాపూర్ మున్సిపల్‌లో జరిగే ప్రతీ సమావేశానికి హాజరవుతానని కలెక్టర్ తెలిపారన్నారు. సమావేశంలో కమిషనర్ రత్నాకర్ రావు, వైస్ చైర్మన్ ఖలీల్, కారింగుల సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమిలత, తొంటి శ్రీనివాస్, చిన్నం సత్యం, ఫౌజియా బేగం, కోఆప్షన్ సభ్యులు రాజుబాయి, కిశోర్ తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై ఫిర్యాదు చేశాం..

పట్టణ పరిధిలో జరుగుతున్న అక్రమ లేఅవుట్‌లు, అక్రమ నిర్మాణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయమై సమావేశంలో సభ్యులం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు ఫౌజియాబేగం, నాయిని స్రవంతి తెలిపారు. బడ్జెట్ సమావేశాలను ఎందుకు బహిష్కరించారని కలెక్టర్ ప్రశ్నిస్తే .. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి ప్రజాసమస్యలు తీసుకెళ్లేందుకే బహిష్కరించామని సమాధానమిచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ చెప్పారన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా స్తంభాల తొలగింపునకు రూ.10 లక్షలు కేటాయింపుతోపాటు పలు అంశాలను వ్యతిరేకించామన్నారు. గతంలో తైబజార్ వేలం డబ్బులు వసూలు చేయకుండానే కొత్తగా టెండర్ వేయడంపై ప్రశ్నించామన్నారు. కమిషనర్ ఫోన్ చేసినా స్పందించడం లేదని వెంటనే తొలగించాలని కోరామన్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయించాలని వినతి

ఖానాపూర్: అర్హులకు డబుల్ బెడ్ రూం ఇల్లు చెందేలా సెల్ఫ్ అఫిడవిట్ తీసుకోవాలని పట్టణానికి చెందిన నిరుపేద మహిళ కరిపె లక్ష్మి కలెక్టర్‌ను కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ వరుణ్‌రెడ్డికి కౌన్సిలర్ నాయిని స్రవంతి ఆధ్వర్యంలో అఫిడవిట్ అందజేశారు. తాను అర్హురాలిని అయినా అధికారుల తీరుతో లక్కీడ్రా పద్ధతిలో ఇల్లును కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్, అధికారులను కలవాలని వారితో మాట్లాడుతానని కలెక్టర్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: భైంసా పట్టణానికి చెందిన రమేశ్, సాగర రాములుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం దేగాం గ్రామంలోన తన నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి లబ్ధిదారుల కుటుంబసభ్యులకు చెక్కులు అందించారు. రమేశ్‌కు రూ.1.25లక్షలు, సాగర రాములుకు రూ.1.50లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ప్రసంజిత్‌ఆగ్రే, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన లక్ష్మికి రూ.24వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం గ్రామంలో ఆమె భర్త రాజేశ్వర్‌కు చెక్కు అందించారు. సర్పంచ్ ఆనంద్ రావు పటేల్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ గిరిశ్ కుమార్, గ్రామపెద్దలు శ్రీకర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలి

ఖానాపూర్: మండలస్థాయిలో పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబధాలు ఏర్పరచుకొని నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఖానాపూర్ సీఐ నారాయణనాయక్ అన్నారు. సోమవారం రాత్రి ఖానాపూర్‌లోని తన కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆయా మండలాల్లో నమోదైన కేసుల వివరాలు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భార్యాభర్తలకు సంబంధించిన కేసుల విషయంలో కౌన్సిలింగ్ పద్ధతిలో అవగాహన కల్పించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం గ్రామస్థాయిలో అమలయ్యేలా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ఆర్.శంకర్, రజనీకాంత్, ప్రభాకర్, రాజు, తదితరులు ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ రాజేందర్, సీఐ

ఖానాపూర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం సీఐ నారాయణనాయక్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఈద్గా వద్ద సౌకర్యాలు కల్పిస్తామని కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శంకర్, వైస్ చైర్మన్ కలీల్, నాయకులు షబ్బీర్‌పాషా, మెహరాజ్, సలీంఖాన్ తదితరులు ఉన్నారు.





'సమ్మేళనం'లో సమన్వయలోపం

జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ మున్నూరుకాపు సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం అసంపూర్తిగా సాగింది. మధ్యాహ్నం వరకు ఉండే ఓపిక లేక కొందరు కార్యకర్తలు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. భోజనాల వద్ద తోపులాట జరగడంతో మహిళలు ఇబ్బంది పడ్డారు. మరికొందరు తమ సమస్యలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వివరించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఆదర్శప్రాయుడు.. జ్యోతిబాపూలే

- ఊరూరా మహనీయుడి జయంతి
- నివాళులర్పించిన నాయకులు



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఖానాపూర్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్ నివాళి



ముధోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



లోకేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో..



బాసరలో తహసీల్దార్ నారాయణ, సిబ్బంది నివాళి

నిర్మల్‌చైన్‌గేట్: మహాత్మ జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడని.. వారు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం నారాయణగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళీధర్ అన్నారు. నిర్మల్ బీజేపీ కార్యాలయంలో బీసీ మోర్చా ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తే తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందన్నారు. మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసినా నిర్మల్‌లో జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయకపోవడం బీసీలను అవమానపరిచినట్లేనని పేర్కొన్నారు. ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, విలాస్, రాపాని గంగాధర్, రాజు, దేవేందర్, శశిరాజ్‌వర్మ, సంతోశ్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు శంకర్, కడారి దశరథ్, గజేందర్, సతీశ్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. ఎంపీపీ కిషన్, జెడ్పీటీసీ శారద, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, శివయ్య, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే రేఖానాయక్ జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. రాజేందర్, శంకర్, ఖలీల్, శ్రావణ్, తదితరులు ఉన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పించగా సీఐ నారాయణనాయక్, వెంకట్రావు, శంకర్, నవీన్, గోవింద్, అశోక్, రాజేశ్వర్, ప్రణీత్, రాజ్‌కుమార్, రాము, సురేశ్, శంభు తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామపెద్దలు లక్ష్మణ్‌పటేల్, నవీన్, పురుషోత్తం, మల్లేశ్‌గౌడ్, సునీల్ రెడ్డి, మోతిలాల్ పటేల్, సలీం, శ్రావణ్ ఉన్నారు.

లోకేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీటీసీ జీవన్, భోజన్న, సీడీ శంకర్, దండే రమేశ్, టీఏలు రవీందర్, హరిత, మంజుల, శారద ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జ్యోతిబాపూలే విగ్రహానికి సర్పంచ్ రాజేందర్ నివాళులర్పించారు. ఈవో పవన్‌కుమార్, ఉపసర్పంచ్ సంజు, రమేశ్, అజీజ్ తదితరులున్నారు.

తానూరు: మండలకేంద్రంతోపాటు ఉమ్రి(కే),బెంబర, వడ్‌గాం గ్రామాల్లో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. భారతీయ బౌద్ధ మహాసభ నాయకులు సాయినాథ్, గంగాధర్, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీసీ విద్యార్థి సంఘం భవనంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం సభ్యులు మనోజ్ యాదవ్, పిండి శ్రీనివాస్, బొంపల విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా: బాసర తహసీల్దార్ కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. తహసీల్దార్ నారాయణ, డీటీ శ్రీనివాస్, ఆర్ఐ నారాయణ పటేల్ ఉన్నారు.



కుంటాల మండలం కల్లూర్‌లో..



భైంసారూరల్: మిర్జాపూర్ పాఠశాలలో



దస్తురాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో..

పల్లెపల్లెకు ఓబీసీ- ఇంటింటికీ బీజేపీ



రేవోజీపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రమేశ్, బీజేపీ నాయకులు

దస్తురాబాద్: మండలంలోని భుట్టాపూర్, రేవోజీపేట, గొడిసీర్యాల, చెన్నూర్ గ్రామాల్లో పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఓబీసీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీసీలను అణిచివేస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ఓబీసీ నాయకులు స్వామి, రాజేశం, చంద్రశేఖర్, రాజన్న, హనుమాగౌడ్, మల్లేశ్, తిరుపతి, రాజేందర్, మునిందర్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో మంగళవారం 'పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, పార్టీ విధానాలను వివరించే కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింబాద్రి, జిల్లా కార్యదర్శి గంగాధర్, ఓబీసీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, దొంతుల లింగన్న, బాబు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ సర్వే

మామడ: మండలంలోని పరిమండల్ గ్రామంలో మంగళవారం అధికారులు సర్వే నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా పారిశుధ్యం, పల్లెప్రగతి, ప్రకృతివనం అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

బడిని సందర్శించిన ఎస్సై

కుంటాల: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ ప్రాథమిక పాఠశాలను ఎస్సై సందర్శించి సూచనలు చేశారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలకు వెళ్తారని పేర్కొన్నారు. వారి వెంట ప్రధానోపాధ్యాయుడు అమృతం, వెంకట్రావు ఉన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి వెళ్తున్న విద్యార్థులు

తానూరు: ఈనెల 3న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. తానూరు, భోసి, ఎల్వి పరీక్ష కేంద్రంలో 439 మందికి గాను పూర్తిస్థాయిలో పరీక్షలు రాసినట్లు ఎంఈవో సుభాష్ తెలిపారు.

సన్మానం

ముధోల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సై సాయికుమార్‌ను మంగళవారం వీడీసీ సభ్యులు శాలువాతో సన్మానించారు. సభ్యులు నారాయణ్, పద్మశాలి నారాయణ్, బాబు, పోతన్న తదితరులు ఉన్నారు.